క్లుప్తంగా

ఆనందపురంలో నెదర్లాండ్ ప్రొఫెసర్ల బృందం పర్యటన



తర్లువాడ ప్రకృతి వ్యవసాయ రైతులతో మాట్లాడుతున్న నెదర్లాండ్ ప్రొఫెసర్లు

తగరపువలస: నెదర్లాండ్‌లోని వేజనింజన్ విశ్వ విద్యాలయం రీసెర్చ్ ప్రొఫెసర్ స్జాక్షీహీ మోవార, అకౌంటెంట్ మేనేజర్ జి.కె.డి.కల్యాణ చక్రవర్తి ఆదివారం ఆనందపురం మండలంలోని తర్లువాడ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఇక్కడి రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పాటించే పద్ధతులు, మోడల్స్, ఇన్‌పుట్స్, మార్కెటింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్గానిక్ స్టోర్‌ను సందర్శించారు. ఇక్కడ రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేసే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు.జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి ఎ.మోహనరావు, భీమిలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు విజయేంద్రప్రసాద్, ఏవో చావా సంధ్యారత్నప్రభ, ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త కొంగర రమేష్, వీహెచ్ఏ దీపిక, ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ఏ బి.శ్రీనివాస చక్రవర్తి, రైతులు, రైతుభరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు

మధురవాడ: ప్రపంచంలో అత్యంత విలువైన వారు పిల్లలు అని, వారు ఎటువంటి చెడు అలవాట్లకు లోనుకావద్దని వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకురాలు కె. రమాప్రభ అన్నారు. ఆదివారం మధురవాడలోని ఓ ప్రైవేటు స్కూల్లో మధురవాడ జోన్ వీసీసీ మహాసభ ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగింది. దీని హాజరైన ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. దురదృష్టవశాత్తూ మత్తు, గంజాయి, మొబైల్ వంటి వాటికి బానిసలవుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వీసీసీ కన్వీనర్ ఎ. సుశీల, కో ఆర్డినేటర్ పి. సతీష్‌లు పాల్గొన్నారు. జీవీఎంసీ 5,6,7,8 వార్డుల పరిధిలోని మధురవాడ జోన్ నూతన కమిటీని ప్రతినిధులు ఎన్నుకున్నారు.

మెదడుకు సాన పడితే అద్భుత ఫలితాలు



శాస్త్రవేత్త కలపాలను సత్కరిస్తున్న ఆలీవర్ రాయ్

పద్మనాభం: మెదడుకు సాన పడితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని విశాఖ ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త పి.కలపాల అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో ఆదివారం సాయంత్రం జరిగిన స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి ఒక్కరిలోను అంతర్లీనంగా ప్రతిభ ఉంటుందన్నారు. లక్ష్యం పెట్టుకుని చదివినప్పుడే అనుకున్నది సాధించ వచ్చన్నారు. వైజ్ఞానిక ప్రదర్శన వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెరుగుందన్నారు. స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల కరస్పాండెంట్ ఆలీవర్ రాయ్ మాట్లాడుతూ నూజువీడులోని ఒక కుగ్రామంలో పుట్టిన కలపాల శాస్త్రవేత్తగా స్థాయికి ఎదిగారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు కలపాలను స్ఫూర్తిగా తీసుకుని శాస్త్రవేత్తలు కావాలని ఆకాక్షించారు. ముందుగా కలపాల వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంటు అందర్నీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన కస్తూర్బా విద్యాలయం, బోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మాంసం విక్రయాలు



వేములవలస మార్కెట్‌లో మటన్ విక్రయాలు

తగరపువలస/మధురవాడ : గణతంత్ర దినోత్సవ వేళ ఆదివారం మాంసం విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. భీమిలి గ్రామీణ ప్రాంతంతో పాటు ఆనందపురంలో చికెన్, మటన్ విక్రయాలు విచ్చలవిడిగా సాగాయి. జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డులలో కొన్ని చోట్ల మాంసం, చికెన్, చేపలు అమ్మకాలు విచ్చల విడిగాసాగాయి. వీటిని నియంత్రించాల్సిన జీవీఎంసీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించారు.



జోనల్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జెడ్సీ ప్రేమప్రసన్న వాణి



శిల్పారామంలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న వాకర్స్

జాతీయభావం చాటుకుంటూ..





గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలు చోట్ల విద్యార్థులు మువ్వన్నెల జెండాలతో సందడి చేశారు. చంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ మోములు, చేతులపై జాతీయ జెండా స్టిక్కర్లు వేసుకుని జాతీయభావాన్ని చాటుకున్నారు. - మధురవాడ

మువ్వన్నెల జెండా రెపరెపలు

•ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు • ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు



భీమిలిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వాసురాజు, ఎంపీడీవో హనుమంతరావు



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న జిల్లా విద్య శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి



చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ శ్రీవాణి



టి.నగరపాలెంలో జెండా ఎగుర వేస్తున్న సర్పంచ్ ఛాయాగౌతమి, ఎంపీటీసీ నీలిమ



వెల్లంకి ప్రాథమిక పాఠశాలలో పతాకావిష్కరణ చేస్తున్న ఉపాధ్యాయులు



బొడ్డపాలెం వైఎస్సార్ కాలనీలో రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్న స్థానికులు



పద్మనాభంలో ఉత్తమ ఉద్యోగులతో అధికారులు, ఎంపీపీ రాంబాబు



దుక్కవాని పాలెంలో నిర్వహించిన వేడుకల్లో మాట్లాడుతున్న బిషప్ పాల్ విక్టర్



తగరపువలసలో రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్న మాజీ సైనికులు



మధురవాడ విద్యుత్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఏఈ శ్రీనివాసరావు

మధురవాడ : మువ్వెన్నెల జెండా రెపరెపలాడింది. గణతంత్ర వేడుకలను మధురవాడలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో నిర్వహించారు. మధురవాడలోని జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఎంవీడీ ఫణిరాం పతాకావిష్కరణ చేశారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

➡ రాష్ట్రంలోనే పెద్దది అయిన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జి. రవి పతాకావిష్కరణ చేశారు. ఎన్‌సీసీ, గ్రీన్ క్రాప్స్, స్కౌట్స్ విద్యార్థుల డ్రిల్, యోగా, ఇతర విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీకాకుళం ఒమరవిల్లి డైట్ ప్రిన్సిపాల్ గౌరి శంకర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

➡ కొమ్మాది రిక్షా కాలనీలోని ఆంధ్ర ప్రదేశ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీఓఈలో ప్రిన్సిపాల్ శాంతి కుమారి పతాకావిష్కరణ చేశారు. విద్యార్థుల యోగ, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

➡ చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద చంద్రంపాలెం గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మధురవాడ మాజీ పర్సన్ ఇన్‌చార్జి పిళ్లా లక్ష్మణ జాతీయ జెండా ఆవిష్కరించారు. గ్రామ పెద్దలు పిళ్లా చంద్రశేఖర్, పిళ్లా మధు, శ్రీనివాసరావు, పీస రామారావు, జగ్గుపిల్లి నాని, పిళ్లా సత్యన్నారాయణ, నాని పాల్గొన్నారు.

➡ మధురవాడ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేశారు.

➡ మధురవాడ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి. శ్రీనివాస రావు జాతీయ జెండాను ఎగురవేశారు. మధురవాడ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

గీతంలో...

కొమ్మాది: రుషికొండలో గల గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. గీతం ప్రో.వైస్ చాన్సిలర్ డా.బి.గీతాంజలి జాతీయ జెండాను ఎగురవేశారు.

భీమిలిలో ..

భీమునిపట్నం: భీమిలిజోనల్ కార్యాలయం వద్ద జోనల్ కమిషనర్ ప్రేమప్రసన్న వాణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

➡ జిల్లా విద్యశిక్షణ సంస్థ (డైట్) వద్ద ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అధ్యాపకులు ఎల్.సుధాకర్, సోమయాజులు, మాధవి, త్రినాథరావు పాల్గొన్నారు.

➡ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఎంపీడీవో హనుమంతరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కచారు.

➡ కీతిన్‌పేటవద్దనున్న సన్‌స్కూల్ వద్ద డైరెక్టర్ శ్రీనివాసరావు గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు.

శిల్పారామంలో..

పీఎంపాలెం: శిల్పారామంలో స్థానిక వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్ర రాజు, స్థానిక ఏటటీ.విశ్వనాథరెడ్డి గణతంత్ర వేడుకల్లో పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో శివానంద్ , చిరంజీవి పాల్గొన్నారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్ఐ భాస్కరరావు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో విశాఖ నార్తజోన్ ట్రాఫిక్ సీఐ సాయి జాతీయ జెండాను ఎగురవేశారు.

➡ ఏపీఎస్పీ 16వ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ కేవీ మురళీకృష్ణ జాతీయ పతాకం ఎగురవేశారు.

కార్మికవాడలో ..

తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీవాణి జాతీయ పతాకావిష్కరణ అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

➡ భీమిలి మండలం టి.నగరపాలెంలో గ్రామస్తుల సమక్షంలో సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ గ్రామ సచివాలయం వద్ద పతాకావిష్కరణ చేశారు.

➡ జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో పీపీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, పరిమి భువనేశ్వరి తదితరులు జాతీయ జెండా ఎగురవేసి విద్యార్థులకు స్వీట్లు, బహుమతులు పంపిణీ చేశారు.

➡ తగరపువలస ఆంధ్రా బ్యాంకు కూడలిలో బీజేపీ 2వ వార్డు అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి, చిట్టివలస ఎస్‌బిఐ బ్రాంచ్ వద్ద సీనియర్ మేనేజర్ వి.శ్రీనివాసరావు, విశ్రాంత సిబ్బంది వేడుకలలో పాల్గొన్నారు.

➡ తగరపువలస కేంద్రంగా వందలాది మంది మాజీ సైనికులు జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించి అంబేడ్కరు చిత్రపటానికి నివాళులర్పించారు.

➡ బంగ్లామెట్టపై వైఎస్సార్‌సీపీ నాయకులు తమ్మిన కూర్మారావు, సోమి అప్పలరాజు అంబేడ్కరకు నివాళులర్పించారు.

➡ ఆదర్శహిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం నిర్వహించారు.

➡ ఆనందపురం మండలం బొడ్డపాలెం వైఎస్సార్ కాలనీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 70 మందికి సేవలు అందించారు.

➡ వెల్లంకి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గణతంత్ర దినోత్సవం నిర్వహించారు.

➡ పెద్దిపాలెంలో నిర్వహించిన వేడుకలలో సర్పంచ్ బావిశెట్టి భారతమ్మ, గుండు ఎల్లారావు, ఉప్పాడ అప్పారావు, ప్రధానోపాధ్యాయురాలు పిన్నింటి రోజా రమణి తదితరులు పాల్గొన్నారు.

➡ దేశ భవిష్యత్తులకు బాలలే పునాదులని బిషప్ పాల్ విక్టర్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆనందపురం మండలం దుక్కవానిపాలెం షారోన్ గ్రౌండ్స్‌లో నెక్స్ట్ జన్ కార్యక్రమంలో జరిగిన గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు , రెవరెండ్ సుధాకర్ పాల్, రాజ్‌కుమార్, ప్రేమ్ మతరంగ, ప్రకాష్, జార్జి బాబు జాన్, ప్రభుదాస్ అబ్రహం పాల్గొన్నారు.

పద్మనాభం మండలంలో..

పద్మనాభం: ఎంపీడీవో ఎం.విజయ కుమార్, తహసీల్దార్ కార్యాలయం వద్ద కె.ఆనందరావు జాతీయ జెండా ఎగుర వేశారు. తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయిలో ఎనిమిది మంది ఉత్తమ ఉద్యోగులకు ఎంపీపీ కంటుబోతు రాంబాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కళిరెడ్డి దామోదరావు జ్ఞాపికలు అందజేశారు.



సాక్షి మధురవాడ కార్యాలయంలో రిపబ్లిక్ డే సందర్భంగా పతాకావిష్కరణ చేస్తున్న ప్రొడక్షన్ మేనేజర్ మహేష్ రెడ్డి



చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్లో పతాకావిష్కరణ చేస్తున్న హెచ్ఎం రవి



చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్లో ఆకట్టుకున్న బాలికల యోగా విన్యాసాలు



కొమ్మాది రిక్షా కాలనీలోని ఆకట్టుకున్న విన్యాసాలు



గురుకుల సీవోఈలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అతిథులు

ఉత్తమ ఉద్యోగులకు జిల్లా స్థాయి అవార్డులు



కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న పద్మనాభం తహసీల్దార్ ఆనందరావు, కానిస్టేబుల్ త్రినాథరావు, ఆనందపురం పీహెచ్‌సీ స్టాఫ్‌నర్స్ రామలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు,భీమిలి పంచాయతీ విస్తరణ అధికారి రమేష్‌నాయుడు

పద్మనాభం/తగరపువలస/భీమునిపట్నం: పద్మనాభం, తగరపు వలస, భీమిలి మండలాల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు జిల్లా స్థాయి అవార్డులు లభించాయి. పద్మనాభం తహసీల్దార్ కె.ఆనందరావు, పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఆవాల త్రినాథరావుకు అవార్డులు లభించాయి. అలాగే ఆనందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.గంగునాయుడు, స్టాఫ్ నర్స్ ఆర్.రామలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ బి.కోటేశ్వరరావుకు, భీమిలి పంచాయతీ విస్తరణ అధికారి కె.రమేష్‌నాయుడుకు అవార్డులు లభించాయి. విశాఖలో జరిగిన గణతంత్ర వేడుకల్లో వీరికి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



కునాల్ జైట్లీకి అవార్డు అందిస్తున్న ఐఐఎంవీ ప్రతినిధులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ప్రతిబింబించండి, మళ్లీ కనెక్ట్ చేయండి, పునరుద్ధరించండి అనే థీమ్‌తో జరిగిన కార్యక్రమంలో 120 మంది పూర్వవిద్యార్థులు 9 బ్యాచ్‌లుగా పాల్గొన్నారు. డీన్ మారిశెట్టి విజయభాస్కర్ వీరికి స్వాగతం పలికారు. యంగ్ అలుమ్నస్ అచీవర్ అవార్డుకు 2015-17 బ్యాచ్‌కు చెందిన ఎంబీఏ విద్యార్థి కునాల్ జైట్లీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ ప్రసంగించారు. డీన్‌లు కావేరి కృష్ణన్, అమిత్ శంకర్, పూర్వ విద్యార్థుల చైర్‌పర్సన్ దీపికా గుప్తా తదితరులు పాల్గొని మాట్లాడారు.

శ్రీరామనామం.. సర్వజన రక్ష



మేళతాళాలతో సభా స్థలికి రామయంత్రాన్ని తీసుకొస్తున్న చాగంటి కోటేశ్వరరావు తదితరులు

మధురవాడ: శ్రీరామ నామమే సర్వజనానికి రక్షణ ఇస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో అష్టలక్ష్మి, వైశాఖేశ్వర స్వామి ఆలయం, గాయత్రి విద్యాపరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సంపూర్ణ రామాయణంపై 42 రోజుల ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రెండవ రోజైన ఆదివారం రుష్యశృంగ మహర్షి చరిత్ర, పుత్రకామేష్టి యాగం, హనుమ, ఇతర వానరులు, శ్రీరామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల ఆవిర్భావ ఘట్టాలను వివరించారు. సనాతన ధర్మంలో యజ్ఞం చేత ప్రీతినొందిన దేవతలు కోరికలు తీరుస్తారని రామాయణం స్పష్టం చేస్తుందన్నారు. కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి కాంచీపురం నుంచి ప్రత్యేకంగా పంపించిన శ్రీరామ యంత్రాన్ని ప్రవచన స్థలికి మేళతాళాలతో స్వయంగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ జననం ప్రవచనం సందర్భంగా గర్భిణులకు సుఖప్రసవం జరిగి, ఆరోగ్యవంతులుగా ఉండేందుకు తమిళనాడులోని తంజావూరు గర్భ రక్షాంబిక అమ్మవారి ప్రసాదంగా ప్రత్యేక శ్లోకాన్ని దర్మవర్తిని ట్రస్టు ముద్రించి భక్తులకు పంపిణీ చేశారు. అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి దంపతులు, గాయత్రి కార్యదర్శి ప్రొఫెసర్ సోమరాజు, నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అశేషంగా పాల్గొన్నారు.

బాలికా సాధికారితపై అవగాహన

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీఓఈలో బాలికా సాధికారితపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీ ఐఏఎస్ఏ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. నాగరాజకుమారి, ఢిల్లీ ఐసీఎస్ఎస్ఆర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎన్ చారిలు విద్య ద్వారా బాలికలకు సాధికారత కల్పించే వికసిత్ భారత్ కోసం సామాజిక చేరిక అనే అంశంపై విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడారు.

క్రీడా టోర్నమెంట్ ప్రారంభం

పద్మనాభం: మండలంలోని రేవిడిలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, విశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించనున్న నియోజక వర్గ స్థాయి క్రీడా టోర్నమెంటు ఆదివారం ప్రారంభమైంది. కబడ్డీ, వాలీబాల్, పరుగు పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం సభ్యుడు తుగరోతు మధు, రిటైర్డు ఎంపీడీవో సత్య బాపిరాజు, ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వైఎస్సార్ సీపీ నాయకులు కోన రమణ, మరగడ అప్పారావుపాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

తగరపువలస: ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆనందపురం మండలం రామవరంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 100 మంది రక్తదానం చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



చిన్న శ్రీనుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న వార్డు నాయకులు

• వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్నశ్రీను

కొమ్మాది : ఎన్నికల అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇకపై ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు రుషికొండలో మాజీ సర్పంచ్ చెన్నాదాసు నివాసంలో ఆదివారం సాయంత్రం జరిగిన వార్డు ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నశ్రీను మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. ప్రతి కార్యకర్త తలెత్తుకునేలా పార్టీని గెలిపించుకుందామన్నారు.

నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు సంక్షేమ పాలనతో అందరూ క్షేమంగా ఉన్నారని నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలల్లోనే సంక్షభంలో రాష్ట్రం కొట్టుమిట్టాడుతోందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాల్సిన ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మారుస్తోందన్నారు. ప్రజా పరిపాలన అంటే వైఎస్సార్, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని గుర్తు చేశారు. ఏ పార్టీకి అయినా కార్యకర్తలే బలమని, వారు బలంగా ఉంటేనే నాయకులు, పార్టీ బలంగా ఉంటుందని నమ్మే వ్యక్తి తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దాట్ల పెదబాబు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, 5,7,8 వార్డు అధ్యక్షులు గుడ్లపోలిరెడ్డి, పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, ముఖ్యనాయకులు, నౌడగల రాంబాబు, బంక సత్యం, మాదు చంటి, పిల్లా సురిబాబు, పోతిన పాత్రుడు, పోతిన మూర్తిబాబు, రమణ మూర్తి, రజిని, కుడిత రామారావు, దువ్వివాసు, పాలర మణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

కొమ్మాది: సాగర్‌నగర్ బీచ్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కిరెడ్డిపాలెంకు చెందిన విష్ణువర్ధన్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై భీమిలి వస్తుండగా సాగర్‌నగర్ ప్రభుత్వ అంధబాలికల పాఠశాల వద్ద ఓ కారు వెనుకనుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో విష్ణువర్ధన్ డివైడర్‌పై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

పీఎం పాలెం: విశాఖ ఐ ఆస్పత్రి సౌజన్యంతో పీఎం పాలెంలో గల లమ్‌ఎన్‌కేర్ మినిస్ట్రీస్ ఫౌండర్ ఏసుపాదంలో ఆధ్వర్యంలో స్థానిక బేతని స్కూల్‌లో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శబిరానికి విశేష స్పందన లభించింది. 284 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. క్యాంప్ నిర్వాహకులు సాయికృష్ణ, డాక్టర్ జాహ్నవి, బేతని స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, లమ్‌ఎన్‌కేర్ సంస్థల కరస్పాండెంట్ సునీల్ పాల్గొన్నారు.

53 మద్యం సీసాల పట్టివేత

పద్మనాభం: మండలంలోని తునివలస పంచాయతీ నరసాపురంలో ఇండియన్ గ్యాస్ గోదాము వద్ద శనివారం రాత్రి 50 మద్యం సీసాలు పట్టుకుని సీజ్ చేసినట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలా ఉన్నాయి. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దేవి రెడ్డి శ్రీరాముల నుంచి ఈ సీసాలు పట్టుకుని స్వాధీనం చేసుకుని ఇతని కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.